


ఎర్రగా —

నాలికలు చాచుకుని—

శిఖరాలుగా పైకి లేస్తూ —

క్షణాల్లో ఈ ఇంటి మీంచి ఆ ఇంటి మీదికి దూకుతూ —

పై భాగంలో - కిందంతా - నల్లగా, దట్టంగా పొగతో - భుగభుగలాడుతూ -

ఉంగరాలుగా గిరగిరాలు తిరుగుతూ-

అందరూ చూస్తూండగానే మంటలు తాడెత్తు లేచాయి. హాహాకారాలు - కేకలు - నీళ్ల కోసం పరుగులు - యువకులు శక్తికొద్దీ బిందెలతో, బకెట్లతో నీళ్ళు విసురుతున్నారు. ఇళ్లెక్కేందుకెవరికీ ధైర్యం లేదు.

నిప్పును ఆర్పడం సులభం కాదు. ఎర్రగా విజృంభిస్తే కబళించడం దాని లక్షణం. అడ్డొస్తే, పక్కదారికి మళ్లి, మరింత మాడ్చేస్తుంది.

మనిషికి నిప్పంటే చెప్పలేనంత భయం. నిప్పులేకపోతే రోజు గడవదు. అదుపుతప్పితే అణచేందుకు శక్తి చాలదు.

ఆ గూడెంలోని పదమూడు కొంపలూ ఆహుతయ్యాకగాని మంటలు చల్లారలేదు. అంతా అయ్యాక ఆపకెప్పుడో ఫైరింజన్ హడావిడిగా దూసుకుంటూ, కూతవేస్తూ వచ్చి, బూడిదలో నీరు పోసింది.

* * *

"అదుగో - పట్టుకోండి - పరుగెట్టండి -"

చీకటి గుండెల్లోంచి దూసుకొచ్చిన నిశిత బాణంలా పెద్ద కేక.

అరుగులమీదా, చెట్ల కిందా నక్కి కూచున్న జనం కర్రలు పట్టుకుని హడావిడిగా - గుబగుబలాడుతూ పరుగులు

"ఎంకలు వర్సయ్యా! - నీ ఎనకాల తుప్పలోనేరా-

"అదుగోరా! దొక్కలగూడెనకాల సూడండి-"

బాటరీలైట్లు వెలిగాయి. దూసుకువెళ్లిన వెలుగు కిరణాల్లో జనల కళ్ల నుంచి చూపులు దోషికోసం వెదుకుతున్నాయి. అక్కడెవ్వరూ దొరక్కపోవడంతో అందరూ ఉసూరుమన్నారు.

"అసలు కేకేసిందెవర్రా" అన్నాడు బుర్రమీసాల స్వామినాయుడు.

"సరిగా సూడకుండా ఎందుకురా సెడబొబ్బలు" అంటూ విసుక్కున్నాడు లావుపాటి గురవయ్య ఆయాసాన్ని అణుచుకుంటూ.

దాదాపు పది రోజులుగా ఇదే వరస. ఎవరికీ కంటికి నిద్రలేదు. ఎడతెరిపి లేకుండా అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. దూర ప్రాంతాల నుంచి దుండగులు చీకట్లో చిత్రంగా వచ్చి ఇళ్లకు నిప్పుపెట్టి ఇట్టే అదృశ్యమైపోతున్నారన్న వదంతులతో ఊళ్లు అట్టుడికిపోతున్నాయి. దీనికితోడు - ఏ రోజూ ఏదో మూల నిప్పంటుకుని తగలడిపోయిన తాజా వార్తలు ప్రజలను భయభ్రాంతులను చేస్తున్నాయి. రోజుకో వింత పుకారు - పూటకో ప్రమాదం వార్త - తాటాకిళ్లవాళ్ల గుండెల్లో తుఫాను.

అప్పుడు పల్లెటూరి ప్రజలంతా పగిలే అగ్నిపర్వతాలు. పోలీసులు, అదనపు బలగాలు, అధికారుల పర్యవేక్షణలు - ఎవరూ ఏమీ చేయలేని నిస్సహాయ పరిస్థితి. భయం పగలూ రాత్రీ స్వేచ్ఛగా విహరిస్తున్న వింత.

* * *

"ఇదంతా మా పీకలమీదికొచ్చింది" అన్నాడు అడిషనల్ ఎస్.పి. శ్రీ పి.వి. కరుణాకరరావ్.

జర్నలిస్ట్ రామచంద్రం జాలిగా చూశాడు.

'ఒకటీ - రెండు కాదు- రోజుకో అగ్ని ప్రమాదం జరుగుతుంటే - దానికో ప్రత్యేక కారణం వుండాలిగా-"

అది రామచంద్రం అభిప్రాయం కాదు - ప్రశ్న

ఆ ప్రశ్నకు సమాధానం పోలీసుల దగ్గర లేదు. అధికార యంత్రాంగం యావత్తూ రంగంలోకి దిగింది. కీలక ప్రాంతాల్లో గస్తీ కోసం 'పోస్టు'లు ఏర్పాటు చేశారు. పెట్రోలింగ్ వేన్‌లు 'కీచు కీచు' మంటూ నిర్విరామంగా తిరుగుతున్నాయి.

అయినా అగ్ని ప్రమాదాలు ఆగలేదు.

జర్నలిస్ట్ రామచంద్రం గృహ దహనాల గురించి ఒక పెద్ద వార్త ఫైల్ చేశాడు.

లక్ష్మణరాజులంకలో మొదట నిప్పు పుట్టింది. ఊళ్ళో రెండు తాటాకిళ్లకసారి, మరో మూడిళ్ళు ఆ తరువాత రెండిళ్ళు వారం రోజుల గడువులో భస్మీపటలం కావడంతో జనంలో గగ్గోలు బయలుదేరింది. అలజడి, అసాధారణం జరిగితే ఎర్ర టోపీలవారికి చేతినిండా పని. జిల్లా కేంద్రం నుంచి పోలీసు, రెవెన్యూ శాఖ ప్రధానాధికారులు హడావిడిగా పరుగెత్తుకొచ్చారు. రాత్రివేళ గృహదహనాలు జరుగుతున్నాయి గనక ఊరంతా ట్యూబులైట్లు బిగించారు. ఇంత హడావిడి చేశాక కూడా ఒక కొంపకెవరో నిప్పు పెట్టారు. అధికార

యంత్రాంగం గడగడలాడిపోయింది. మరింత బలగాన్ని పహరాకు దింపినా మళ్లీ ప్రమాదం జరిగింది. మతిలేని మనిషెవరో నేనే దీనికంతా కారణం అని వాగితే, వాడిని లాకప్లో పెట్టి మంచి దిట్టమైన 'కనిష్టీబుల' చేత దేహశుద్ధి చేయించారు.

"ఎదవుజ్జోగం- రేత్రీ పొగలూ ఒకటే డ్యూటీ-" అని విసుక్కుంటూ ఆగ్రహం కక్కుతూ హెడ్ కానిస్టేబుల్ సింహాచలం ఒళ్లు మరిచి వాడిని చావబాదేశాడు.

క్లూ దొరకలేదు. నలభై రోజుల్లో ఒక్క ఊళ్లోనే ఇరవై ఏడిళ్లు తగలబడి, ఆ తరవాత దహనాలు ఆగిపోయి దానంతటదే ప్రశాంతత ఏర్పడింది. దాంతో ఊళ్లో ట్యూబ్లైట్లు ఆరిపోయాయి. నాలుగురోజుల తరవాత ఒక అర్ధరాత్రివేళ ఎలకల్లంకలో ఇరవై ఇళ్లు తగలబడ్డాయి. తాలూకా కేంద్రం నుంచి ఫైరింజన్ వెళ్లి, దొరికినన్ని నీళ్లు చల్లాక, 'కేర్ లెస్ స్మోకింగ్' వల్ల జరిగిన అగ్ని ప్రమాదంలో ఆస్తి నష్టం లక్షానలభై వేలని రికార్డు చేసుకుని, కొంచెం చేతులు తడిపించుకుని వాళ్లు తిరిగొచ్చేశారు. మరునాడు ఆ పక్కనే చిలకల్లంకలో పదిళ్లూ, ఆ మరునాడు సింగరాజుపాలెంలో ఇరవై ఇళ్లూ బూడిదైపోయాయి. గృహదహనాల తీవ్రత గురించి రామచంద్రం వార్త ఎంతో వివరంగా సంచలనం సృష్టించింది.

"కొంప ముంచేవు గదయ్యా సంద్రం బాబూ! నీ రాతలు సూసి జనం బెదిరిపోతన్నారు" వార్త చదివిన వెంటనే సర్కిల్ ఇన్స్పెక్టర్ ఖాదర్ మొయినుద్దీన్ వ్యాఖ్యానించాడు.

పనిలో పనిగా పుకార్లు కొన్ని ప్రచారంలోకి వచ్చాయి. కనిపించని అగ్గి దెయ్యాలు దేవుడంటే నమ్మనివాళ్ల ఇళ్లపై వాలి నిప్పు పెడుతున్నాయట!


"కనీస పక్షం వెయ్యిన్నొక్క ఇళ్లు తగులబెట్టాలని ఒక స్వాములవారు మొక్కుకున్నారని ప్రజలు వింతగా చెప్పుకుంటున్నారు. మీ వరకు వచ్చిందా?" అని ప్రశ్నించాడు రామచంద్రం జిల్లా కలెక్టర్ శ్రీ పి. సూర్యనారాయణమూర్తిని.

ఇది వింటూనే ఆయన ముక్కు మీద వేలేసుకున్నాడు.

"ఈ పుకార్లన్నీ వొట్టివి. భయపడొద్దని ప్రజలకు ధైర్యం చెబుతూన్నాం" అన్నారు కలెక్టర్ వి.సి. భట్,

జోరుగా గాలి వీస్తున్నప్పుడు జాలి లేకుండా అగ్ని దేవుడు ఎర్రని నాలికలు చాచి వ్యాపించే విధంగానే పుకార్లు పెచ్చుపెరిగి తాలూకాలోని యాభై తొమ్మిది గ్రామాలనూ ఒక్క కుదుపు కుదిపాయి. పుకార్లే కాదు — గేదెలపల్లి, ఆవులపాడు, సూరమ్మపుంత, నెహ్రూనగరం, కందాలపాడు — ఇంకా మరికొన్ని గ్రామాల్లో అయిదూ, పదీ యిళ్లు తగలడ్డాయి. రమణయ్యపేటలో సుమారు ఎనభై యిళ్లు ఒక ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైపోయాయి.

ఇళ్లకు నిప్పు పెట్టే వాళ్లు స్ప్రింగు బూట్లేసు




కుని వస్తున్నారట! ఇంటికి నిప్పు పెట్టి క్షణాల్లో భూమ్మీద తన్ని గాలిలో కెగిరి మరో ఊరికి వెళ్లిపోతున్నారట! కాదు కాదు — వాళ్లు కాలికి పసరు రాసుకుని వస్తున్నారట అని కొందరు ప్రచారం చేశారు.

ఉన్నతాధికారులు ప్రమాదాల నివారణకు, పుకార్ల ప్రచార నిరోధానికి తీవ్ర తక్షణ చర్యల గురించి ఒక రాత్రి పొద్దుపోయే వరకూ తలలు బద్దలు కొట్టుకున్నారు:

తాలూకా చుట్టూ ఎటువైపు చూసినా నదీ జలాలు గనుక — ప్రవేశ మార్గాల్లో రాత్రింబవళ్లు నిఘా దళాలను నియమించారు. నది దాటి ఈగ ప్రవేశిస్తే చాలు సోదా తప్పనిసరిగా ప్రకటించి, ఆచరించడం ప్రారంభించారు. నదీ ప్రవేశద్వారాలు శివాయలంక, తాటికుర్రు, పెద్దవరం అక్విడెక్ట్ వద్దా బోట్ పోస్టుల్లో పెద్ద పెద్ద రిజిష్టర్లలో తాలూకాలో ప్రవేశించే వారి వివరాలు రాసేందుకు సిబ్బందిని ఏర్పాటుచేశారు. జీపులు, వేన్లు రాత్రింబవళ్ళు గ్రామాలను చుట్టివస్తున్నాయి. అనుమానం వస్తే చాలు నిర్బంధంలోకి తీసుకునే వారి సంఖ్య నాలుగంకెలకు చేరింది.


రాత్రివేళ జరుగుతున్న గృహదహనాల బారి నుంచి తమ యిళ్లను కాపాడుకునేందుకు గ్రామస్థులు నిద్ర సంగతి మరచి నిరంతరాయంగా తమ యిళ్లు కాపలా కాసుకోడంలో నిమగ్నమయ్యారు. అధికారులకు నిద్ర లేదు. పుకార్లు తగ్గలేదు. దాంతో తాటాకిళ్ల వాళ్లు, జమ్మి నేసుకున్న వాళ్లు యింటి పైకప్పులు వూడదీస్తే ప్రమాదం బారినుంచి తప్పించుకోవచ్చని యిళ్లు విప్పి పోగులు పెట్టడం ఊరూరా అధికారుల కంటబడింది. భయపడవద్దని మైకుల్లో హెచ్చరికలు చేస్తున్నా, గృహదహనాల జోరు తగ్గకపోడంతో బడుగువర్గాలు తమ నీడకు చేటు వాటిల్లిందని కుమిలిపోసాగారు. దీనికితోడు గృహదహనాలు తాలూకా ఎల్లలు దాటి పక్కనున్న రెండు తాలూకాల్లో భయంకరంగా ప్రవేశించాయి.

"నీ ఇల్లు ఇవాళ రాత్రి హరీ! కాచుకో!" అని నందివాడ కరణం శ్రీరామమూర్తి కెవరో ఉత్తరం వేశారు.

"మీ ఊళ్లో అయిదిళ్ల మీద కన్నేశాం" అని మంచుపల్లి సర్పంచ్‌కు ఉత్తరం వచ్చింది.

ఇలా ఆకాశరామన్న ఉత్తరాలు ఒక్కొక్కటీ ఎయస్పి చేతికి అందుతూండడంతో పరిస్థితి తీవ్రతను సంఘ విద్రోహశక్తులు ఎలా వినియోగించుకోడానికి సిద్ధమవుతున్నాయో అధికార యంత్రాంగం గుర్తించింది. ఆ తరువాత బెదిరింపు ఉత్తరాల జోరు మరీ పెరిగింది. దీనికి తోడు గోడల మీద పోస్టర్లు. నాలుగు రోజుల్లో మీ ఊళ్లో ముప్పయి యిళ్లు తగలబెడతామని తీగమల్లిపూడి బాడవలో ఊరి చివర మర్రిచెట్టుకెవరో పెద్ద అట్టమీద అక్షరాలు అందంగా చెక్కి వేలాడదీశారు. గరువు మీదికి గేదెల్ని తోలుకెళుతూ గంగేశు ఆ అట్ట చూసి దారిని పోయేవారికి చెబితే, ఆయనది చదివి సర్పంచ్ చెవిని వేశాడు. అధికార యంత్రాంగం తీగమల్లిపూడి బాడవలో దిగింది. అడుగడుగునా రక్షకభటుడే! ఊరి చివర ఒక యింట్లో వుంటున్న నిరుద్యోగ యువకుడిపై పోలీసుల కన్ను పడింది. పోలీసు పాలిష్ భరించలేక అతను నిజం చెప్పేశాడు.

యోగి, పకోడి, స్వామి, తనూ ఆలోచించి అలా బోర్డు పెడితే ఏమౌతుందో చూద్దామని సరదాగా రాశామని వెక్కి వెక్కి ఏడుస్తూ చెప్పడంతో మిగతా



ముగ్గురికీ దేహశుద్ధి, నిర్బంధం తప్పలేదు.

ప్రమాదాల సంఖ్య పెరిగిందే తప్ప తగ్గకపోవడంతో పోలీసులు ఘోరంగా విఫలమయ్యారని ప్రజలు — ప్రజాప్రతినిధులు, ఇతర శాఖల అధికారులు ఆరోపణలు ప్రారంభించారు.

తీగమల్లిపూడి బాడవలో రాత్రి పన్నెండు గంటలు దాటిన తరువాత ఒక పాకకు నిప్పంటించి పారిపోతూండడం చూసి ఒక యువకుడిని కాల్చి చంపామని ఎయస్‌పి కరుణాకరరావు ప్రకటించారు. పంచనామా సమయంలో ఆ యువకుడెవరో గ్రామ పెద్దలకు అంతు పట్టలేదు. అతనా ప్రాంతం వాడు కాదని వాళ్ళు నిర్ధారణ చేశారు.

జర్నలిస్ట్ రామచంద్రం ఈ సంఘటన గురించి నొక్కి నొక్కి అడిగితే ఎయస్‌పి సమాధానం సూటిగా చెప్పలేదు.

ఇద్దరు యువకులు నిప్పు పెడుతూండగా, పెట్రోలింగ్ వేన్ మీది కానిస్టేబుల్ కిందికి దూకి వారిని పట్టుకునేందుకు ప్రయత్నించాడనీ, ఒక యువకుడు పారిపోగా రెండోవాడు ఎదురు తిరిగేందుకు ప్రయత్నించడంతో కాల్పులు జరపాల్సి వచ్చిందనీ ఎయస్‌పి చెప్పారు. మృతి చెందిన యువకుని వయస్సు పద్దెనిమిది సంవత్సరాలు కాగా అతని గురించి వివరాలు మాత్రం తెలియలేదు.

తీగమల్లిపూడి బాడవలో యువకునిపై కాల్పుల గురించి రామచంద్రం ఫైర్ చేసిన స్టోరీలో తన వైఫల్యాలను కప్పుకునేందుకు, ప్రజలను భయభ్రాంతుల నుంచి మరపించేందుకు పోలీసుల పన్నాగంగా ప్రజలు అనుమానిస్తున్నారని రాయడం అధికారులకు ఆగ్రహం కలిగించింది.

అడిషనల్ యస్‌పి రామచంద్రంపై నిప్పులు కురిపించాడు.

"మీ యిష్టం వచ్చినట్లు రాసి ప్రజలను తప్పు తోవ పట్టించే హక్కు మీకెవరిచ్చారు" అని ఆయన మండిపడ్డాడు.




"ప్రజలను తప్పుతోవ పట్టిస్తున్నదెవరో మీకే తెలియాలి" అన్నాడు రామచంద్రం నవ్వుతూ.

అడిషనల్ ఎస్‌పి నిగ్రహం కోల్పోయి, "మీరెవరితో మాట్లాడుతున్నారో మీకు తెలుసా" అనడిగాడు.


"కొత్తగా ప్రశ్నించకండి. చిల్లర దొంగతనాలు చేసుకునే గెద్దరాజును బెదిరించి, కొట్టి ఈ కేసులో యిరికించడానికి మీ హెడ్డు సింహాచలం, యస్ఐ దేవుడు చేస్తున్న ప్రయత్నాలు నాకు తెలీవనుకున్నారా? ఎవరో ఒక యువకుడిని తీసుకువచ్చి, కాల్చి చంపి గృహ దహనాలను రాడికల్స్‌కు అంటగట్టేందుకు ప్రయత్నిస్తున్న మీ ఆంతర్యం తెలీదనుకున్నారా?" అని రామచంద్రం సూటిగా ప్రశ్నించడంతో ఆయన లేచి నిలబడి, భూమిని తన్నుకుంటూ బయటికి వెళ్లిపోయాడు.


గృహ దహనాల వ్యవహారంలో వైఫల్యాలు కప్పిపుచ్చుకునేందుకు పోలీసులు తిప్పిన మలుపు గురించి మరునాడు రామచంద్రం వార్త రావడంతో అధికారులు తికమక పడ్డారు.

"అది కాదు చంద్రంగారూ! ఈ విషయంలో మీ ఆలోచనలేవైనా మాతో చెప్పొచ్చుగా" అన్నారు కలెక్టర్ ఏకాంతంలో. ఆ రోజంతా రామచంద్రం కలెక్టర్‌ను వెంటబెట్టుకుని గృహ దహనాలు జరిగిన ప్రతి ఊరూ తిరిగాడు. యువకుని మరణం తరువాత వరుసగా మూడు, నాలుగు రోజులు గృహ దహనాలు జరిగాయి. అప్పటికే ఊరూరా ప్రజలు ముందు జాగ్రత్తగా యిళ్ళ పైకప్పులు విప్పిపారేసి, చెట్ల కింద కాపరాలు ప్రారంభించారు.

ఇంటిపైభాగంలో దిష్టి బొమ్మ పెడితే ఆ యింటి మీద అగ్ని దేవత వాలదని ఎవరో చిన్న చిట్కా చెప్పడంతో దిష్టి బొమ్మలకు గిరాకీ పెరిగింది. బొమ్మల తయారీలో నిపుణులైన యువకులు అందచందాలు పక్కన బెట్టి దిష్టి బొమ్మలు చేయడంలో నిమగ్నమయ్యారు. చేసిన బొమ్మలతో ఊరూరూ తిరగడం, విలువ బట్టి డబ్బు అడగడంలో చాకచక్యం అలవడింది. మళ్ళీ ఎవరో తమ గుమ్మానికి నామాలు పెట్టారని అందరూ నామాలు దిద్దించడం ప్రారంభించారు.

సముద్రం ఒడ్డునగల బొంతపాడు తీర్థం సందర్భంగా బిచ్చగాళ్ళు, సాధువులు ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో రావడంతో పోలీసుల దృష్టి వారి మీద పడింది. పోలీసుల కన్ను పడితే పాలిష్ తప్పదు. తలుపులు మూసి పిల్లిని కొడితే అదీ మనిషి గుడ్లు పీకేస్తుంది. మనిషి అలా కాదు. గట్టిగా చావబాదితే "అయ్! అవునండి—నానే సేసేనండి" అని ఒప్పుకుని ఒప్పుకున్నందుకు తనని తను "ఎదవ లంప్డి కొడకా!" అని కూడా తిట్టుకుంటాడు. బక్కపలచటి యాదగిరిని మిట్ట మధ్యాహ్నం మండుటెండలో నిలబెట్టి కాన్‌స్టేబుల్ కనకారావు లాఠీతో నాలుగంటించగానే— "అయబాబో! సంపెయ్యకండి—నానేనండి—పచ్చబొప్పరం సల్లుతానండి—అది నీలంగా ఎలుగుద్దండి—ఎర్రగా కనబడతాదండి—నల్లగా బూడిదైపోతాదండి" అని భోరుమన్నాడు. అడిషనల్ యస్.పి. పాత్రికే



యుల సమావేశం ఏర్పాటు చేసి కెమికల్ పౌడర్ ప్రభావంవల్ల గృహ దహనాలు జరుగుతున్నాయని బిచ్చగాళ్ళే యిందుకు కారణమనీ, పన్నెండు మందిని నిర్బంధంలోకి తీసుకున్నామనీ ప్రకటించారు.

గృహ దహనాలకు మూల కారణం తెలిసిపోయింది గనుక యింక నిశ్చింతగా వుండొచ్చని పోలీసు అధికారులు భావించారు. దానికి కలెక్టర్ భట్ ఒక వెర్రి నవ్వొకటి నవ్వి ఊరుకున్నారే తప్ప— అవుననాలేదు—కాదనాలేదు.

"మిస్టరీగా మారిన గృహ దహనాలు"

"అంతు చిక్కని గృహ దహనాలు"

"అంతు బట్టని వింత అగ్ని ప్రమాదాలు"

"నిద్రలేని ఊళ్ళు"

ఇలా తలా హెడ్డింగ్‌తో అన్ని పత్రికలూ రోజూ వార్తలు ప్రచురించాయి. మంత్రిగారొకరు హడావిడిగా పర్యటించి అగ్ని ప్రమాదాలకు ప్రతి పక్షమే బాధ్యత వహించాలని ఆరోపించారు. దాంతో ప్రతి పక్షం వారంతా తమ వర్గ విభేదాలు మరచి అధికార పక్షంపై విరుచుకు పడ్డారు. స్థానిక ప్రజా ప్రతినిధిపై ఆరోపణల వర్షం కురిపించారు. ప్రభుత్వ వైఫల్యాన్ని దుయ్యబట్టారు. పేపర్లు స్టేట్‌మెంట్లు ఖండనలతో నిండిపోయాయి. వంకాపల్లి, కమలాపురం, పిల్లిలంక, పిట్టలపాడుల్లో తిరిగి దహనాలు జరగడంతో అధికార, ప్రతిపక్షాలు ఒకరిపై మరొకరు ఆరోపణాస్త్రాలు సంధించారు.

మొత్తం ముప్పైఆరు గ్రామాల్లో జరిగిన నలభై ఎనిమిది సంఘటనల్లో రెండు వందల ముప్పైఆ రెండు యిళ్ళు కాలిపోగా మూడు వందల ఇరవై నాలుగు కుటుంబాలు నిరాశ్రయులయ్యారని, రమారమి తొంభై లక్షల రూపాయిలు ఆస్తి నష్టం చేకూరిందనీ ప్రభుత్వ సమాచార శాఖ వివరాలు వెల్లడించింది.

*  *  *

పడమటినాడ. ఇంకా చీకటిగానే వుంది. యస్.పి. కలెక్టర్ హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. మంటలు లేచే తొలి దశలోనే ఆర్పేశారు. కొంత పెంకు, మరికొంత తాటాకు వేసిన పై కప్పు మీద ఎర్రని చీర ముక్క. కిరోసిన్‌లో ముంచి వుండాలి. జర్నలిస్ట్ రామచంద్రం చెప్పిన మాటలు, దానికి తానిచ్చిన సమాధానం కలెక్టర్ బుర్రలో కదులుతున్నాయి.




పోలీసులు చుట్టుపట్ల యిళ్ళన్నీ గాలించేశారు. నిప్పు పెట్టబోయిన ఎదురింట్లోనే ముక్క చింపిన ఎర్ర చీర కనిపించింది. క్లూ దొరికిపోయింది.

మల్లయ్య ఒంటిమీద దెబ్బ పడకుండానే నిజం ఒప్పేసుకున్నాడు. కిరోసిన్‌లో ముంచిన చీర ముక్క తానే విసిరానన్నాడు. ఆ యింటి యిల్లాలంటే తనకిష్టమని, ఎన్నిసార్లు బతిమిలాడినా అంగీకరించడం లేదనీ తన కోపం తీర్చుకునేందుకింతకంటె మార్గాంతరం కనిపించ లేదని వివరించాడు.

ఆ మరునాడు జరిగిన ఒక ప్రమాదంలో దూరంగా యింట్లోని ఒక ఆసామీ తనకు అప్పు యివ్వనన్నాడన్న కోపంతో కక్ష తీర్చుకునేందుకు తాను నిప్పు పెట్టానని వెంకటావు పోలీసుల చేత తినవలసినవన్నీ తిని చెప్పాడు. ఆ తరువాత మరో భయంకర సత్యం కూడా చెప్పాడు. తాను మంత్రిగారి బంధువునవడంతో పోలీసుల పని యిరకాటంలో పడింది. జరిగిన దుర్ఘటనలన్నింటినీ ఈ కోణంలో చూసినప్పుడు ప్రతి సంఘటన వెనకా స్థానికుల హస్తం వుండడం స్పష్టమైంది.

రామచంద్రం ఆ తరువాత రాసిన వార్తలో చివరి పేరా—

ఆందోళన చెందడం, పుకార్లు నమ్మడంతో ప్రజలు భయ భ్రాంతులయ్యారే తప్ప—అధికారులు ముందు చూపుతో వ్యవహరించి వుంటే ఇంత ముప్పు జరిగేది కాదు. గృహ దహనాల అలజడి ప్రారంభమయ్యాక మామూలుగా అగ్నిప్రమాదం జరిగినా జనం దానిని మామూలుగా పోనీలేదు. అన్నింటినీ గృహ దహనాల వ్యవహారానికి ముడి పెట్టారు. పచ్చ భాస్వరాలూ, స్ప్రింగ్ బూట్లూ, అగ్ని దేవత, వెయ్యినొక్క యిళ్ళ మొక్కు వంటి కథలు సృష్టించడంలో యథాశక్తి ఎవరికి వారు ఒకరిని మించి మరొకరు కృషి చేశారు. దీని వెనుక బిచ్చగాళ్ళు, ప్రజా ప్రతినిధులు, జెండాలు వున్నాయనుకోడం, పరస్పర ఆరోపణలు మరింత తికమక ఏర్పడింది. అవకాశం లభించడంతో స్థానికులు తమ కక్షలు తీర్చుకుందుకు స్థానికులు ప్రయత్నించడం దురదృష్టకరం. భగ్న ప్రేమికులకు, అప్పు దొరకని వారికి, ఈర్ష్యతో అసూయతో మానవత్వం మరచిపోయిన వారికి, ఆకతాయి కుర్రకారుకు, పాత కక్షలతో బాధపడే వారికి నిప్పు చేతికి రావడం గొప్ప చిక్కు తెచ్చి పెట్టింది. పుకారు నిప్పుకంటె ప్రమాదమైందనీ, వినాదం మరిస్తే నిజం కనుమరుగౌతుందనీ రుజువైంది. వైఫల్యాలు కప్పిపుచ్చుకుందుకు ఎవరి ప్రాణాలు తీయనక్కరలేదని, బుకాయింపు కంటె అసలు కారణాలు తెలుసుకోవాలని అధికారులు గ్రహించాల్సి వుంది.


*






# మేకు

— పులికంటి కృష్ణారెడ్డి



మాకడు మాధవనాయుడు దగ్గర అప్పు చేసింది నిజం. ఆ అప్పును అసలు వడ్డీలతో సహా ఆరునెలల లోపలే తీరుస్తానని మాట యిచ్చింది నిజం. మాట యివ్వడమే కాదు— ఆ మేరకు 'నామనోరాజీనా వ్రాయించి యిచ్చిన బాండు' అని ఆ ఊళ్లో ప్రాథమిక పాఠశాల పంతులుగారి చుట్టూ పదిసార్లు ప్రదక్షిణ చేసి బాండు రాయించింది నిజం.

ఆ బాండులో ఎడమ చేతి బొటనవేలికి అంత బండి కందెన రుద్దుకొని వేలిముద్ర వేసింది నిజం. ఆ సమయంలో ఆ దారిన పోతున్న చెంగారెడ్డిని చంద్రయ్యను బ్రతిమ లాడి సాక్షి సంతకాలు వేయించింది నిజం. ఆ రోజు నుండి ఆ అప్పును తీర్చి 'ఋణ విముక్తుడు' కావాలని కలలు కనింది నిజం!

అయితే యిచ్చిన మాట ప్రకారం ఆరు నెళలు కాదు— ఆరారు పన్నెండు నెలలైనా అప్పు తీర్చలేకపోయింది కూడా నిజం!

మాకడు కులం తక్కువవాడే కావచ్చు. కానీ గుణంలో మాత్రం కాదు. కాలం కలిసి రానపుడు ఎంత గుణవంతుడైతే మాత్రం ఏం చేస్తాడు? ఎంత బలవంతుడైతే మాత్రం ఏం చేస్తాడు? అందుకే మాకడి మాట మాటగానే మిగిలిపోయింది.

మాకడు మాధవ నాయుడి ఎదుట పడలేదు. అలాగని తప్పించుకుని తిరగలేదు. మాట విలువ తెలిసినవాడికే ఆ బాధ అర్థ మవుతుంది.

మాకడు మధనపడి పోతున్నాడు.

నెమలి కంట్లో నీళ్లుగార్తే వేటగాడికి ముద్దా?—

మాధవ నాయుడు కారాలు మిరాలు నూరుతున్నాడు. నూరడా మరి? ఆరారు పన్నెండు నెలలు దాటినా 'అడిగిన తక్షణం చెల్లించి ఈ బాండులో చెల్లు వ్రాయించి నా బాండు నేను వాపసు తీసుకోగలవాడను' అన్న పెద్ద మనిషి నిలదీసి అడిగినా బెల్లం కొట్టిన రాయిలా ఉలక్కుండా పలక్కుండా వుంటే?—

నాయుడికి బదులు చెప్పలేకపోతున్నాడని నడిమధ్య ఎవరైనా తలదూర్చి! 'ఏ విరామాకా? నువ్వు చెప్పిందేమి? చేసిందేవిరా? అంటే—

"ఏవి జెయ్యమంటారు మీరే సెప్పండి సావి! అప్పుజేసి పప్పన్నం తినాలని మునాస పడ్తినా? కట్నాలు కాని కలిచ్చి ఎదిగిన బిడ్డెను ఎవుడి సేతిలో అయినా పెట్టాలనుకుంటినా? లేదు వగా వ్రటా కొని మా యింట్లో దానికి పైన్నుండి కింది దాకా దిగేయాలనుకున్నానా? వుండే